క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని కొత్తరాంపురంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే తన కోటా నుంచి రూ.10లక్షలు మంజూరు చేయించడంతో పనులుప్రారంభించారు.పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యేఅధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యేకు పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, మత పెద్దలు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆదోని రూరల్: మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదోనిలోని కళాశాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై ప్రధాని మోడీ ప్రభుత్వ తీరు దారుణమని చెప్పారు. న్యాయం కోసం నాలుగు నెలలుగా పోరాడుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు లక్ష్మన్న, గణేష్, రాజు, మహేష్, శాంతి, నాగరాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

పెద్దకడబూరు: కల్లుకుంట గ్రామంలో శుక్రవారం 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసుల పేర్కొన్నారు. గ్రామ సమీపంలో సారా కాస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడిచేసి దాదాపు 500 లీటర్లకు పైగా బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎరిగేరి రాముడును అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ

కౌతాళం: కుంబళనూరు గ్రామానికి చెందిన ఈరన్న శుక్రవారం అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం పరిధిలోని మురవని గ్రామం నుంచి తరలిస్తుండగా 5బాక్స్‌లు టెట్రా ప్యాకెట్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈరన్నను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. దాడిలో పోలీసులు పులిరాజు, శ్రీరాములు, వీరభాస్కర్, మంజునాథ్ పాల్గొన్నారు.

ఎన్నికల వేళ జాగ్రత్త..

కర్ణాటక ఎన్నికల వేళ స్థానిక వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు. ఎవరైన కర్ణాటక నుంచి మద్యం, డబ్బులు, చీరలు వంటి వాటి వస్తువుల్ని దిగుమతి చేసుకున్న లేదా ఎగుమతి చేసిన కేసులు నమోదు చేస్తామన్నారు. నగదు లావాదేవీలకు సంబంధించి సరైన పత్రాలు ఉండాలన్నారు.

బీరలింగేశ్వరుడికి పల్లకీ సేవ

నందవరం: కురబల ఆరాధ్యదైవం బీరలింగేశ్వరుడి పెద్ద దేవర సందర్భంగా శుక్రవారం గ్రామంలో స్వామి వార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కట్ట పరిధిలోని 72 గ్రామాల భక్తులు బండారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కుంభోత్సవం ఉంటుందన్నారు. ఆలయం వద్ద వానాల రాకపోకలు ఇబ్బంది లేకుండా వాహనదారులు సహకారించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్దికెరలో భారీ వర్షం


మద్దికెర: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. 9.6 సెం.మీ వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పొలాలలో వర్షపునీరు ప్రవహించింది. అలాగే రైల్వే బ్రిడ్జి కింద నీరు నిల్వడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సైలెన్సర్‌లోకి నీరు పోవడంతో బస్సు నిలిచిపోయింది. స్థానికుల సహాయంతో బయటకు తీశారు.

జేలా కార్యక్రమం ప్రారంభంలో పాల్గొన్న ధర్మకర్త, భక్తులు



ఘనంగా జేలా

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగా స్వామి దర్గాలో జేలా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తి ఆధ్వర్యంలో తెల్లవారు జామున ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం తరహాలోనే ఈ ఏడాది కూడా స్వామి ఉరుసుకు నెల ముందుగా జేలా వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జేలా కార్యక్రమాన్ని 1881 నుంచి దర్గా ఆరవ పీఠాధిపతి సయ్యద్‌షా బాఖార్‌వలి చిష్తి నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా ధర్మకర్త తెలిపారు. అప్పటి నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడం వల్ల గ్రామంలో కలరా, మశూచి వంటి రోగాలు ప్రబలవని, ప్రకృతి వైపరీత్యాలు అయిన అధిక వర్షాలు, కరువు కాటకాల నుంచి ప్రజలు బయటపడి అందరూ సుఖసంతోషాలతో జీవిస్తారని తెలిపారు. ఈ వేడకలకు భక్తులు గురువారం రాత్రి నుంచే తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం స్వామి వారి చిత్రపటంతో పాటు పూలతో కూడిన జేలాను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ ఖాదర్‌బాషా చిష్తీ, గుల్షన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు మున్నపాష, ఖాదర్‌లింగ శిష్యరిక బృందం, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



జేలాను దర్గా గుమ్మజ్‌పై కడుతున్న దృశ్యం

త్వరలో కోసిగి ప్రాంతానికి

పుష్కలంగా నీరు

● ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డిశేఖర్ రెడ్డి



సాగునీటి పైప్‌లైన్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్ రెడ్డి

కోసిగి(మంత్రాలయం): పులికనుమ రిజర్వాయర్ నుంచి త్వరలోనే కోసిగి ప్రాంతానికి పుష్కలంగా సాగు, తాగు నీటిని అందిస్తామని ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం కోసిగి సమీపంలో పులికనుమ రిజర్వాయర్, సాగునీటి పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి కోసిగి ప్రాంతానికి తాగు, సాగునీటిని అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు పులికనుమ మిగులు బడ్జెట్ నుంచి పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రెండున్నర అడుగుల పైప్‌లైన్‌ను రిజార్వాయర్ నుంచి బసవన్న కొండ దిగువ ప్రాంతం అనుకుని 5.3 కిలోమీటర్లు వేయిస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పనులు పూర్తి అయితే కోసిగి, పెండేకల్లు, పీకలబెట్ట, గొడగల్లు గ్రామాల పరిధిలోని 1500 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామన్నారు. అలాగే అదే పైప్‌లైన్ నుంచి భూగేని చెరువును ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో మరమ్మతులు చేస్తున్నామన్నారు. స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు పనులు పూర్తి దశకు చేరుకుందన్నారు. తుంగభద్ర నదికి నీటి ప్రవాహం మొదలైన వెంటనే పైప్‌లైన్ ద్వారా స్టోరేజ్ ట్యాంక్‌కు తాగునీటిని నింపుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనులకు అడ్డంకి కాకుండా సాగునీటి పైప్‌లైన్ పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్ డీఈలు మురళీ, కృష్ణన్న, ఏఈ వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సవం.. వైభవం

● 900 కేజీల పసుపుతో స్వామివారి అలంకరణ



మానస గాయత్రీ సమేత నాగసింధూర గణనాథ స్వామిని పసుపుతో అలంకరించిన దృశ్యం

ఆదోని అర్బన్: పెద్దహరివాణం క్షేత్రం గిరిజానది తీరంలో వెలిసిన శ్రీ మానస గాయత్రీ సమేత నాగసింధూర గణనాథ స్వామి వారి రథోత్సవ వేడుకలు శుక్రవారం వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మ వారికి ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, సప్త నది తీర్థములతో పుష్కర స్నానాలు గంగానది తీర్థముతో అభిషేకాలు నిర్వహించారు. హోమం కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి 7.30 గంటల నుంచి అశేష జనుల మధ్య గణపతిస్వామికి హరిద్రోత్సవ వేడుకలు నిర్వహించారు. దాదాపు 900 కిలోల పసుపును ఈ వేడుకలకు వినియోగించినట్లు ఆలయ ధర్మకర్త గరుడాద్రి సుబ్రహ్మణ్యంశాస్త్రి తెలిపారు.

రైల్వే బ్రిడ్జికి స్థల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కౌతాళం: మండల పరిధిలోని ఏరిగేరి-కుప్పగల్ గ్రామాల మధ్య ఉన్న రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరు కావడంతో శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు డిజైన్లతో కల్గిన మ్యాప్‌లను ఆయన ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారులతో పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నత అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

రూ. 10 లక్షల టీటీడీ నిధులు మంజూరు

కౌతాళం: ఎరిగేరి గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి తిరుపతి తిరుమల దేవస్థానం నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు గ్రామ సర్పంచ్ గోవిందు తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధులతో ఆలయ పునఃనిర్మిస్తున్నామన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం చేయండి



పోలీసులకు సూచనలు ఇస్తున్న సెబ్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

ఆదోని రూరల్: కర్ణాటక ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని సెబ్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణకాంత్‌పటేల్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన పెద్దహరివాణం, బాపురం సెబ్ చెక్‌పోస్టులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న సిబ్బందికి తనిఖీలు పెంచి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బ్లాక్‌బోర్డుల పంపిణీ



బోర్డుల్ని పంపిణీ చేస్తున్న స్వామిదాస్

కౌతాళం: మండలంలో ఆర్డీప్, ఐఎల్‌పీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షరాభివృద్ధిలో కార్యక్రమంలో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు కట్టా స్వామిదాసు బ్లాక్ బోర్డులను పంపిణీ చేశారు. ఆర్డీప్ ఐఎల్‌పీ సంయుక్తంగా కలిసి గ్రామాల్లో వలంటీర్లను నియమించి విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు.

ఆదోని జగనన్న కాలనీకి ప్రత్యేక గుర్తింపు



ఆదోని జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఈఈ రవికుమార్

ఆదోని టౌన్: పట్టణంలోని మండగిరి లేవుట్‌లోని ఆదోని జగనన్న కాలనీకి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని హౌసింగ్ బోర్డు ఈఈ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కాలనీలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 300 ఎకరాల భూసేకరణ చేసి అందులో 10,200 మందికి పట్టాలు పంపిణీ చేసిందన్నారు. అలాగే పక్కా ఇళ్ల మంజూరు చేయడం చేసిందన్నారు. 5,100 మంది ఇళ్ల నిర్మాణాల కోసం పునాదులు, బెడ్డింగ్ వేయడం జరిగిందన్నారు. 1,200 ఇళ్లు రూఫ్‌లెవెల్‌కు వచ్చాయని, మరో 50 ఇళ్లు చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఇంటి పునాదులు, సీసీ బెడ్డింగ్, లెంటల్ లెవెల్, రూఫ్ లెవెల్ స్థాయిలో జరుగుతున్న ఇళ్ల వద్ద మాత్రమే వర్షపు నీరు నిలిచిందన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల ఎక్కడా ఇబ్బందులు ఏర్పడలేదన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం, రోడ్లు, తాగునీటి వసతి కల్పించామన్నారు. త్వరలో కల్వర్టులు, పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన స్టీలు, సిమెంట్, ఇసుక లబ్ధిదారుల అవసరం మేరకు స్టాకు ఉన్నాయన్నారు. స్టీలు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోడౌన్‌లో భద్రపరచడం జరిగిందన్నారు. బెడ్డింగ్ వేసే సమయంలో మాత్రమే లబ్ధిదారులకు స్టీలును పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

జీవాల సంత మరో చోటికి తరలింపు



ఎమ్మిగనూరు రోడ్డు కంపోస్టు యార్డు వద్ద గొర్రెల, మేకల వారపుసంతను నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: పట్టణంలోని బోయగేరి బొబ్బలమ్మ గుడి వద్ద రోడ్డుపై నిర్వహించే జీవాల సంతను ఎమ్మిగనూరు రోడ్డు కంపోస్టు యార్డు వద్దకు తరలించారు. బొబ్బలమ్మ గుడి వద్ద స్థలం ఇరుకుగా ఉండటంతో స్థానికులు, వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం జరిగే సంత వద్దకు కమిషనర్ రఘునాథ్‌రెడ్డి మున్సిపల్ రెవెన్యూ ఆర్‌ఐ లవ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాస్‌లు సిబ్బందితో చేరుకుని అందరికీ నచ్చజెప్పి సంతను కంపోస్టు యార్డు వద్దకు తరలించారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

● ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్

ఆదోనిటౌన్: పట్టణంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరి వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆదోని పట్టణంలోని రణమండల కొండల్లోని యల్లమ్మ ఆలయానికి వెళ్లే వై.జంక్షన్‌లో సీఐ విక్రమసింహ, హెడ్‌కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీ చేపట్టారు. యల్లమ్మ కొండవైపు నుంచి వస్తున్న ఆటోను తనిఖీ చేయగా 35 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడింది. ఆటోలో ఉన్న బోయగేరికి చెందిన వడ్డే నరసింహ, బలిజ లక్ష్మిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.2.65 లక్షలు ఉంటుందన్నారు. అలాగే వీరికి సహకరించి పరారీలో ఉన్న గుండా అనే వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. వాహన తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుళ్లు మద్దిలేటి, హాజీ, కానిస్టేబుళ్లు రంగస్వామి, నాగరాజులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మదిరె గ్రామానికి చెందిన శ్రీనివాసులు కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఇస్పీ హెడ్‌కానిస్టేబుల్ బషీర్‌అహ్మద్ విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఆదోని-సిరుగుప్ప రహదారిలోని మహాయోగి లక్ష్మమ్మవ్వ వేర్‌హౌస్ వద్ద టీ బంకులో మద్యం విక్రయిస్తుండగా 110 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

● పట్టణంలోని వాల్మీకి నగర్‌లో నివాసముంటున్న బోయ శివ అక్రమంగా కర్ణాటక మద్యాన్ని కలిగి ఉండడంతో అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. 23 కర్ణాటక మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడ్డొద్దు



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి బొకే అందజేస్తున్న ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం రూరల్: నియోజకవర్గంలో శాంతి భద్రత పరిరక్షణలో రాజీ పడ్డొదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి.. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్యకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఇటీవల ఎమ్మిగనూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సీతారామయ్య ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని శాంతి భద్రత విషయాలను గురించి చర్చించారు.

నేడు అల్లీపీరా స్వాముల ఉరుసు

ఎమ్మిగనూరురూరల్: గుడేకల్ గ్రామంలో శనివారం జరిగే సద్గురు అల్లీపీరాస్వాముల ఉరుసుకు భక్తులు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి, దర్గా ట్రస్ట్ ప్రెసిడెంట్ గురు గాజిహుసేన్‌పీరా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి స్వామి ప్రభోదనలు, శనివారం తెల్లవారుజామున గంధం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు గుడేకల్‌కు చేరుకుంటున్నారు. దర్గా ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా విత్తనాల పంపిణీ

ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఆర్‌బీకేల ద్వారా పకడ్బందీగా విత్తనాల పంపిణీ చేపడతామని పత్తికొండ వ్యవసాయ సబ్‌డివిజన్ సంయుక్త సంచాలకులు మోహన్ విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన దేవనకొండలో శుక్రవారం వివిధ ఎరువుల షాపులను ఆయన ఏఓ సురేష్‌బాబుతో కలసి తనిఖీ చేశారు. రికార్డులు, నిల్వ ఉంచిన ఎరువులు, విత్తనాలను ఆయన పరిశీలించారు. అనంత రం విలేకరులతో మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే షాపులను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన కంపెనీలకు చెందిన ఎరువులు, విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేసుకోవాలని, ఆ మేరకు రసీదులు పొందాలన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



విద్యుత్ సిబ్బందిని నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు శశిరేఖ

● మండల మీట్‌లో ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు: మండల అభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ శ్రీవిద్య హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరమణప్ప ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమతమ శాఖాపరమైన నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా హనుమాపురం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు శశిరేఖ మాట్లాడుతూ హనుమాపురంలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని నాలుగు సమావేశాల్లో విన్నవిస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో విద్యుత్ తీగలు ఇళ్లపై వేలాడుతున్నాయని అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కల్లుకుంట, ముచ్చగిని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని సంబంధిత సర్పంచ్‌లు ఇస్మాయిల్, హనుమంతు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని నిలదీశారు. అనంతరం ఎంపీపీ శ్రీవిద్య మాట్లాడుతూ అభివృద్ధికి సంబంధించి కావాల్సిన గ్రాంట్‌ను ఎంపీపీ నిధుల నుంచి మంజూరు చేస్తున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు తమ శాఖ నివేదికను వినిపించిన వెంటనే బయటకు వెళ్లిపోవడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశానికి ముందుగా ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వైస్ ఎంపీపీ పరమేష్‌గౌడ్‌కు సభలో సభ్యులు నివాళలర్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు వీరేంద్రగౌడ్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.